క్లుప్తంగా

నేడు పసుపు కొమ్ములతో అలంకారం



పెనుగంచిప్రోలు: స్థానిక గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారికి ఆదివారం పసుపుకొమ్ములతో అలంకారం చేయనున్నట్లు ఈవో తెలిపారు. ఈ మేరకు శనివారం మహిళాభక్తులు అమ్మవారి అలంకారం కోసం పసుపుకొమ్ములను దండలుగా తయారు చేశారు. ఉదయం ఐదు గంటల నుంచి అమ్మవారి దర్శనం కోసం రావచ్చని తెలిపారు.

95 శాతం పింఛన్లు అందజేత

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో అన్ని గ్రామాలలో 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నితిన్ శనివారం తెలిపారు. ఈ నెల ఒకటిన ఆదివారం కావటంతో ముందస్తుగానే సచివాలయ సిబ్బంది, కార్యదర్శులతో పింఛన్ పంపిణీ చేసినట్లు చెప్పారు.

దాళ్వా సాగు చేయొద్దు

జగ్గయ్యపేట: రైతులు దాళ్వా సాగు పంటలను నిలిపివేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ ఆదేశాల మేరకు నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో నీటి కొరత కారణంగా జగ్గయ్యపేట డివిజన్‌లోని రైతులు రబీ సీజన్‌లో దాళ్వా పంటలు సాగు చేయవద్దన్నారు. రైతులు గమనించాలని కోరారు.

కేంబ్రిడ్జి యూనివర్సిటీతో అనుసంధానం



కంచికచర్ల: పరిటాల అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాలలో అకడమిక్ ప్రోగ్రాంతో పాటు స్కిల్ ఓరియెంటెడ్ కోర్సుల్లో భాగంగా విద్యార్థులకు కేంబ్రిడ్జి ఇంగ్లిష్ ఎంపవర్ ప్రోగ్రాంను ప్రారంభించామని కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కే రామ్మోహనరావు పేర్కొన్నారు. కాలేజీలో శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథి కేంబ్రిడ్జి యూనివర్సిటీ అసెస్మెంట్ అండ్ ప్రెస్ మెంబర్ పి.మల్లిఖార్జుననాయుడు మాట్లాడుతూ అకడమిక్ ఎబిలిటీ, ఆంగ్ల సమాచార నైపుణ్యం, భాషా నైపుణ్యం, నూతన ఉద్యోగావకాశాలు, విదేశీ విద్య, ఉద్యోగం, ఇండస్ట్రీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కళాశాల కేంబ్రిడ్జి యూనివర్సిటీతో అనుసంధానం చేసుకుందన్నారు. ఈ ప్రోగ్రాం ప్రాముఖ్యతను, దీనిని అవలంభించే పద్ధతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముందుగా కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఇంగ్లిష్ ఎంపవర్‌మెంట్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ కేంబ్రిడ్జి ఇంగ్లిష్ ఎంపవర్ ప్రోగ్రాంను పూర్తిచేసి సర్టిఫికేషన్ పొందినట్లయితే ఐఈఎల్‌టీఎస్, తోఫెల్, గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్‌కు సంబంధం లేకుండా కొన్ని దేశాలలో ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. బీటెక్ ప్రథమ సంవత్సరం నుంచేప్రోగ్రాంను ప్రారంభించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పీ చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, కేంబ్రిడ్జి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ హేమ కృష్ణ శాస్త్రి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

వీరులపాడు: మండలంలోని జయంతి గ్రామంలో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. 20 మంది దంపతులు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజలను వంచించిన బాబు

– వైఎస్సార్ సీపీ నేత ఇంటూరి చిన్నా

జగ్గయ్యపేట అర్బన్: సూపర్ సిక్స్ అంటూ కేవలం అధికారం కోసం హామీలు ఇచ్చి, అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్నా) విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన నవరత్నాలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేశారని, కానీ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు 6 సంక్షేమ పథకాలను సూపర్ సిక్స్ పేరుతో అమలు చేయడానికి నానా తిప్పలు పడుతున్నారన్నారు.అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని, ఇంకా తగ్గిస్తామని ఇచ్చిన హామీని కూటమి నేతలు గాలికి వదిలేసి 5 నెలల్లోనే ప్రజలపై రూ.17 వేల కోట్లకు పైగా కరెంట్ చార్జీల భారాన్ని మోపి ప్రజలను వంచించారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా డిస్కింలకు సకాలంలో రాయితీలు అందించి ఆదుకుందన్నారు. సంపద సృష్టించడమంటే విద్యుత్ చార్జీలు, యూజర్ చార్జీలు, టోల్ చార్జీలతో ప్రజల నడ్డి విరగగొట్టడమేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకొని పెంచిన అదనపు వ్యయాన్ని భరించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని, స్మార్ట్ మీటర్ల మార్పు కేవలం ఆదాని కంపెనీలకు లాభం చేకూర్చడం కోసమే కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు.

తెల్లబంగారం దళారుల పాలు

- పత్తికి దక్కని గిట్టుబాటు ధర
- సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు నిల్
- నష్టపోతున్న రైతులు
- స్పందించని ప్రభుత్వాలు



జుజ్జూరులో పత్తి లోడ్ చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

వీరులపాడు: పత్తి రైతులు ఈ ఏడాది పంటను అమ్ముకునేందుకు అనేక కష్టాలు పడుతున్నారు. సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పంట దళారుల పాలవుతోంది. నష్టానికి పంటను అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో 11,921 హెక్టార్లలో..

నియోజకవర్గంలో ఈ ఏడాది రైతులు 11,921 హెక్టార్లలో పత్తి పంట సాగు చేపట్టారు. నందిగామ మండల పరిధిలో 1,820 హెక్టార్లు చందర్లపాడు మండలంలో 5,194 హెక్టార్లు, కంచికచర్ల మండలంలో 2,508 హెక్టార్లు, వీరులపాడు మండలంలో 2,399 హెక్టార్లలో రైతులు సాగు చేశారు.

మద్దతు ధర కంటే తక్కువగా..

పత్తి పంటకు ఎకరాకు రూ.35 వేల నుంచి 45 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నా మద్దతు ధర లేకపోవడంతో దళారులకు తక్కువ ధరకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం పత్తికి క్వింటా మద్దతు ధర రూ.7,521 కాగా దళారులు కాయ, పత్తి పేరుతో రూ.5,500 నుంచి ఆరు వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఉన్నా..

నందిగామ, కంచికచర్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా పూర్తి స్థాయిలో కొనుగోలు జరగకపోవడంతో దళారులు చెప్పిన ధరకే రైతులు పత్తిని విక్రయిస్తున్నారు. పత్తి విత్తనాలు వేసిన నాటి నుంచి పురుగు మందులకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నామని, తీరా పంట చేతికి వచ్చిన తరువాత గిట్టుబాటు ధర లేక నష్టానికి అమ్ముకుంటున్నామని రైతులు వాపోతున్నారు. గడచిన రెండేళ్ల నుంచి భారీ వర్షాల కారణంగా ఈ ఏడాది కూడా వర్షాలతో పంట దెబ్బతిందని రైతులు పేర్కొంటున్నారు.

అధికారులు స్పందించాలని వినతి..

ఇప్పటికైనా అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాలలో పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలంటున్నారు.

సీసీఐ కేంద్రాల్లో కొనాలి..



అరుగాలం కష్టపడిన రైతుకు నష్టమే మిగులుతోంది. పెట్టుబడి కూడా రాని దుస్థితి నెలకొంది. నేను నాలుగు ఎకర్లాలో పత్తి సాగు చేశా. దళారులకు తక్కువ ధరకే రైతులు పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాలలో పత్తిని కొనుగోలు చేస్తే రైతుకు గిట్టు బాటు ధర వస్తుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– మల్లెల రాంబాబు, రైతు, పెద్దాపురం

ఖర్చులు పెరిగాయి..



నేను ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. కౌలు, పురుగు మందులు మొత్తం కలిపి ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాను. పత్తిలో తెగుళ్ల నివారణకు వాడే పురుగు మందుల ధరలు గతంలో కంటే మూడు రెట్లు పెరిగాయి. దీనికి తోడు వ్యవసాయ కూలీ కూడా పెరగడంతో ఎక్కువ పెట్టుబడి అవుతోంది. పంట దిగుబడి బాగున్నా మద్దతు ధరకు కొనక పోవడంతో నష్టం వస్తోంది.

– చలమల దుర్గారావు, రైతు, చట్టన్నవరం

వలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు



కంచికచర్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, వలంటీర్లు

కంచికచర్ల: గ్రామ, వార్డు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంచికచర్ల ఏపీ ఎన్జీఓస్ సంఘ కార్యాలయంలో శనివారం మండల స్థాయి వలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్జీఓస్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వలంటీర్ల సేవలు కేంద్ర ప్రభుత్వం సైతం కొనియాడిందన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను మంజూరు చేయించి అందించారన్నారు. అధికారంలోకి రాగానే వలంటీర్లను అన్ని విధాలుగా ఆదుకుంటామని చంద్రబాబు అన్నారని, కూటమి నాయకులు ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10 వేలు గౌరవ వేతనం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు మాట నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న వలంటీర్లకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకోకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, తహసీల్దార్ పీ జాహ్నవిలకు వినతిపత్రాలు అందజేశారు.

మండల కమిటీ ఎన్నిక..

అనంతరం మండల స్థాయి వలంటీర్ల సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. వలంటీర్ల మండల అధ్యక్షుడిగా దూండీ, కార్యదర్శిగా సీహెచ్ రవీంద్ర, ఉపాధ్యక్షులు ఎస్కే హిమామిహాసిన, ఎస్.నాగలక్ష్మి, కే అగర్వాల్, సహాయ కార్యదర్శులుగా సీహెచ్ చిట్టిబాబు, కే దుర్గాప్రసాద్, డీ స్వప్న, కోశాధికారి కే రాధారాణి, కమిటీ సభ్యులు ఎస్.జీవకుమారి, సీహెచ్ నాగవాహిని, దుర్గాప్రసాద్, జీ రాజు, ఎం.శ్రీలక్ష్మి, మాధవి, నాగమణి, బోస్, విజయ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లను సద్వినియోగం చేసుకోవాలి



పింఛన్‌లను పంపిణీ చేస్తున్న విప్, ఎమ్మెల్యే సౌమ్య

నందిగామ టౌన్: ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు సామాజిక భద్రతను పెంచే ఉద్దేశంతో పింఛన్‌ల పంపిణీని ప్రభుత్వం మరింత సరళీకృతం చేసిందన్నారు. ఆయా కారణాల వల్ల లబ్ధిదారులు రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా మూడో నెలలో మొత్తం పింఛన్ తీసుకునే వెసులుబాటు కల్పించిందని తెలిపారు. పింఛన్‌ల పంపిణీని మొదటి రోజే నూరు శాతం పంపిణీ చేసేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, నాయకులు విశ్వనాథపల్లి కృపారావు, మారం అమరయ్య, యేచూరు రాము, లక్ష్మీనారాయణ, షేక్ జానీ, పలువురు నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ అఫ్రపున్నీసా బేగం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్‌శాఖ సీఐ అఫ్రపున్నీసా బేగం

కంచికచర్ల: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటే ఉన్నతమైన జీవితాన్ని అనుభవించవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ షేక్ అఫ్రపున్నీసాబేగం పేర్కొన్నారు. కంచికచర్ల మహర్షి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం 'మాదక ద్రవ్యాలను అరికడదాం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలను వినియోగించటం వల్ల నిండు జీవితం బలి అవుతుందన్నారు. ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ముందుగా మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్‌వల్ల జ్ఞాపకశక్తి తగ్గిపోతుందన్నారు. యువత అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలను అరికడదామని, బంగారు భవిష్యత్‌కు మంచి పునాది వేసుకుందామని పేర్కొన్నారు. ఇప్పటికే డ్రగ్స్ నియంత్రణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ, పోలీస్‌శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుటుందని ఆమె అన్నారు. కళాశాల కరస్పాండెంట్ షేక్ ఖాసీం మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలబారిన పడకుండా చదువుపై దృష్టి సారించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి వాసు, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ షేక్ గాలీబ్ సాహెబ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తికమాస ముగింపు పూజలు



జగ్గయ్యపేటలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



మంగొల్లు శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


వత్సవాయి: గత నెలరోజులుగా భక్తిశ్రద్ధలతో జరిగిన కార్తికమాస పూజలు శనివారంతో ముగిశాయి. వత్సవాయి, దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, లింగాల, చిట్టేల, మక్కపేట, భీమవరం, మంగొల్లు గ్రామాలలోని శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. ఉదయాన్నే ఆలయాలకు చేరుకున్న భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు జరుపుకుని ఒత్తులు వెలిగించుకున్నారు. స్వామివార్లకు అన్నాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కాశీవిశ్వేశ్వరునికి పూజలు

జగ్గయ్యపేట: పట్టణంలోని బ్రాహ్మణ బజార్‌లో అన్నపూర్ణా సహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా శనివారం రాత్రి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అన్నాభిషేకం, లక్షబిల్వార్చనను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అర్చకులు ప్రసాద్, నరసింహారావు ఆధ్వర్యంలో ఘనంగా పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రముఖులు పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న తుఫాన్ హెచ్చరికలు

కల్లాల్లోనే ధాన్యం, మొక్కజొన్న



కల్లాల్లో పట్టాలు కప్పిన ధాన్యం, మొక్కజొన్న

వీరులపాడు: తుఫాన్ హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముసురు వాతావరణం రైతుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలను చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలకు నీటిపాలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. రెండు, మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు, తుఫాన్ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలో ఎక్కువ శాతం ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. గత ఆగష్టులో వచ్చిన అకాల వర్షాలు, వరదలకు పంట నష్టపోయామని తరువాత ఏదో విధంగా తంటాలు పడి తిరిగి సాగు చేపట్టామని రైతులు అంటున్నారు. గత వర్షాలు, వరదలకు దెబ్బతినకుండా ఉన్న పంటలను రైతులు కోసి కల్లాల్లో ఆరబోయగా వరదల తరువాత సాగు చేసిన పంటలు కోతలకు సిద్ధంగా ఉన్నాయి. తాజాగా వాతావరణ శాఖాధికారులు చేస్తున్న తుఫాన్ హెచ్చరికలతో చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తిప్పలు పడుతున్నారు. పొలాల్లో ఉన్న పంటను చేసేదేమీ లేదని, కల్లాల్లో ఉన్న పంటనైనా కాపాడుకుందామని పట్టాలు కప్పుతూ ఉరుకులు పరుగులు పెడుతున్నారు. గతంలో నష్టపోయిన పంటకే స్థాయిలో ప్రభుత్వం పరిహారం అందించలేదని, మరోసారి వర్షాలకు, వరదలకు పంట నష్టపోతే ఆత్మహత్య లే శరణ్యమనిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ సభ్యుల డిమాండ్



సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యుడు వట్టెం మనోహర్, వైస్ చైర్మన్ హఫీజున్నీసా

జగ్గయ్యపేట అర్బన్: పైపులైన్ల లీకులన్నింటినీ గుర్తించి మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిల్ సీసీ తాజుద్దీన్ ఎజెండాలోని అంశాలను చదివి వినిపించారు.

■ 5వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ ఇటీవల వరద ముంపునకు హెడ్‌వాటర్‌వర్క్స్ (పంప్‌హౌస్)లో బురదమట్టి మేటవేసినందున తొలగించాలని కోరారు. కృష్ణా జలాల ప్రాజెక్టు నిర్వహణ చూస్తున్న కోయ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ కాంట్రాక్టు డిసెంబర్ 15తో ముగియనున్నందున పెండింగ్ సమస్యలు, లీకేజీలు వారితోనే చేయించాలని, పంప్‌హౌస్ వద్ద సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర స్పందిస్తూ వారం రోజులు గడువు ఇవ్వాలని, తరువాత అందరు కౌన్సిలర్లు వెళ్లి చూడవచ్చని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా మాట్లాడుతూ కంపోస్ట్ యార్డులో బీటీ రోడ్డు వరకు వ్యర్థాలను తొలగించడానికి అద్దె ప్రాతిపదికన జేసీబీకి రూ.2.31 లక్షల నామినేషన్ వర్కులు నిలిపివేయాలని, దీనిపై డీసెంట్ ఇస్తామన్నారు. 1, 2 అంశాలకు సంబంధించి రూ.9.50 లక్షల వ్యయంతో 140 వరకు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఆయా వార్డుల కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా చేశారని, దీనిని ఆమోదించవద్దని కోరారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో సీఎస్సార్ నిధులతో మూడు ఆర్వో ప్లాంట్లను ప్రస్తుత ప్రభుత్వం మూసివేయాలని, అక్కడి ఉద్యోగులను తొలగించి వారి మనుషులను పెట్టుకోవాలని చూస్తున్నారన్నారు. బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న ఆర్వో ప్లాంట్‌కు మున్సిపాలిటీ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. త్వరలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ అన్నారు.

■ అధికారులు పట్టించుకోని తీరుపై..

మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్ల ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణలు అన్నీ తొలగించాలని, వివక్ష చూపకూడదన్నారు. 30వ వార్డు కౌన్సిలర్ పందుల రోశయ్య మాట్లాడుతూ డిపో సెంటర్, తదితర ప్రాంతాలలో రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు కౌన్సిలర్లకు కనీస గుర్తింపు ఇవ్వడంలేదని రోశయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

■ కమిషనర్, డీఈఈ, ఏఈల తీరుపై..

5వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ కమిషనర్, డీఈఈ, ఏఈల పనితీరుపై ధ్వజమెత్తారు. 5వ వార్డులో ఖాళీ స్థలం బాగుచేయడానికి వచ్చిన జేసీబీ డ్రైవర్ రూ.4 లక్షలతో నిర్మించిన డ్రెయిన్ ధ్వంసం చేశారని, రెండు సార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, పైగా ఆరు నెలల క్రితం ధ్వంసం అయిన డ్రెయిన్ ఇటీవల వచ్చిన వరదకు ధ్వంసం అయిందని సంవత్సరం క్రితం పనిచేసిన కంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చారన్నారు. దీనిపై అధికారులకు, మనోహర్‌కు కొద్దిసేపు వాగ్వివాదం జరగ్గా, చైర్మన్ జోక్యం చేసుకొని ఇంజినీర్లు కొత్తగా వచ్చారని, డిసెంబర్ 10 వరకు గడువు ఇవ్వాలని కోరారు. అలాగే చూస్తామని, లేకుంటే న్యాయస్థానం ఆశ్రయిస్తామని మనోహర్ చెప్పారు.

■ సమస్యల ప్రస్తావన..

కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, వెంకట్, సుందరమ్మ, కంచేటి గీతారాణి, కర్ల శాంతకుమారి, అలేఖ్య తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. కమిషనర్ రామ్మోహనరావు, అందరు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభోత్సవం

హాజరుకానున్న వైఎస్సార్ సీపీ ప్రముఖులు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన పార్టీ కార్యాలయం



తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక కోదాడ రోడ్, యోగీరామ్ హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజవర్గ కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు పార్టీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వైఎస్సార్ సీపీ ఉమ్మడి కృష్ణా జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్లు వైవీ.సుబ్బారెడ్డి, అయోధ్యరామిరెడ్డి, పార్టీ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధ్యక్షులు దేవినేని అవినాష్, పేర్ని నాని, మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర, జిల్లా నాయకులు రానున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం అదే స్థలం పక్కన తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు.

కార్యకర్తల సమావేశానికి తరలిరండి..

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు అనంతరం జరుగు నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలుఅభిమానులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, వలంటీర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, మహిళలు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తన్నీరు నాగేశ్వరరావు కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ శనివారం పేర్కొన్నారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ శివారులోని ఒక షెడ్డులో పేకాడుతున్నట్లు సమాచారం రావటంతో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను రూ.10,900 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారు తెలంగాణకు చెందిన వారు కూడా ఉన్నారు. ఇదిలా ఉండగా హుజూర్‌నగర్‌కు చెందిన రవి అనే వ్యక్తి శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ

వీరులపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు ఉపాధి హామీ పథకం అంబుడ్స్ మెన్, జిల్లా విచారణ అధికారి చాట్ల ఇమ్మానియేలు తెలిపారు. వీరులపాడులోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో 2023– 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి జరిగిన అవకతవకలపై శనివారం ఆయన విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని బోడవాడ, నందలూరు, తాటిగుమ్మి, గోకరాజుపల్లి, గ్రామాలలో జరిగిన పనుల్లో అవకతవకలు జరిగాయని ప్రజలు ఫిర్యాదు చేశారని చెప్పారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ నిర్వహించి నివేదికను పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనార్దన్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కాపు కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి



మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేస్తున్న వట్టెం మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలో కాపు కుటుంబ సభ్యుల చిరకాల వాంఛ కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రను కోరారు. ఈమేరకు శనివారం చైర్మన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వట్టెం మనోహర్ మాట్లాడుతూ స్థలం కేటాయిస్తే ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, పేదవారికి అందుబాటులో ఉండే విధంగా వంగవీటి మోహనరంగా సేవాసమితి పేరున ప్రజలకు ఉపయోగపడే విధంగా దాతల సహాయంతో నిర్మాణం చేస్తామని తెలిపారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి వచ్చే కౌన్సిల్ సమావేశం నాటికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



నరసింహారావు మృతదేహం

పెనుగంచిప్రోలు: గుండెపోటుతో వీఆర్వో మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని తోటచర్ల వీఆర్వోగా పాముల పాటి వెంకటనరసింహారావు (45) విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే తేరుకున్న సిబ్బంది నందిగామ వైద్యశాలకు తీసుకువెళ్లగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. నరసింహారావుకు వివాహం కాలేదు. తండ్రి కూడా చనిపోవడంతో నందిగామలో తల్లితో కలిసి ఉంటున్నాడు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com